క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలో 33 కేవీ లైన్ మరమ్మతు పనులు జరుగుతున్నందున పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 8.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఫీడర్ పరిధిలోని టౌన్ 1, 2, 3 కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా లవకుమార్



పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

చండూరు : గౌడ సంఘం చండూరు పట్టణ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోడ లవకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం చండూరు పట్టణంలోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి లవకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బోయపల్లి రోశయ్య, చనగాని పెంటయ్య, బోడ రామలింగయ్య, నకిరెకంటి భిక్షమయ్య, యాదయ్య, గోపాల్, వెంకన్న, శేఖర్, గంగాధర్, సత్యనారాయణ, ఆంజనేయులు, వంశీ, శేఖర్, శ్రీను, రాజు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చండూరు : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు బోధించడానికి అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్ ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్–1, ఇంగ్లిష్–1, తెలుగు–1, అర్థశాస్త్రం–1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. పీజీలో 55 శాతంతో ఉత్తీర్ణత పొంది, నెట్, సెట్, అర్హతతో పీహెచ్‌డీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ నెల 25లోగా దరఖాస్తులు కళాశాలలో అందించాలని, వివరాలకు 9490536839 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఆరోపణలు తగదు

నకిరేకల్: నియోజకవర్గంలో లా అండ్ ఆర్డర్ అదుపు తప్పిందని, ప్రజాస్వామ్యం లేదని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించడం తగదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న ఖండించారు. నకిరేకల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చిరుమర్తి లింగయ్య ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అన్ని రకాలుగా అధోగతి పాలుచేసిన నకిరేకల్ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం గాడిలో పెడుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు గాదగోని కొండయ్య, కొండ వెంకన్న, మిర్యాల చంద్రశేఖర్, పొల్లెద్దు వెంకటేష్, చనగాని సుధాకర్, నిమ్మగోని సైదులు, కొంపెల్లి భాస్కర్, జిల్లా ఆనంద్, పాటి యాదగిరిరెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

నీలగిరిలో ఫుడ్ ఫెస్టివల్



క్యాంటిన్ వద్ద ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్

నల్లగొండ టూటౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల కార్యక్రమంలో భాగంగా నీలగిరి మున్సిపాలిటీలోని అన్నపూర్ణ క్యాంటిన్ వద్ద మెప్మా ఆధ్వర్యంలో సోమవారం ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, టీఎంసీ శ్రీనివాస్, సీఓలు నర్సింహ, జ్యోతి, అనిల్, రాజు, ఆర్పీలు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

చిట్యాల: మండలంలోని చిన్నకాపర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్ అడ్మిషన్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కో ఆర్డినేటర్ పానుగోతు సైదానాయక్, సహాయక కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.పదో తరగతిలో అడిష్మన్ పొందేందుకు వారు చదివిన రికార్డు షీట్, టీసీ, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఫొటోను సమర్పించాలని, ఓపెన్ ఇంటర్‌లో చేరేందుకు పదో తరగతి పాస్ మెమో, టీసీ, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఫొటోను సమర్పించి అడ్మిషన్‌లు పొందవచ్చన్నారు. ఈ నెల 31వ తేదీలోపు అడ్మిషన్‌లను పొందాలని సూచించారు. వివరాలకు 9441331489, 9441291637 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలి

చిట్యాల: బీబీనగర్‌లో ఈ నెల 23, 24వ తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని రాష్ట్ర కమిటీ సభ్యుడు కత్తుల లింగస్వామి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కార్మికులు, కూలీల పక్షాన పోరాడేందుకు భవిష్యత్ కార్యాచరణ కార్యక్రమాలను ఈ సమావేశాల్లో తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నత్తనడకన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం



ఎల్లమ్మగూడెంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

- తిప్పర్తి మండలంలో 785 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- 470 ఇళ్లకు ముగ్గు పోసుకున్న లబ్ధిదారులు
- పూర్తిస్థాయిలో ప్రారంభం కాని పనులు

తిప్పర్తి : ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. మొదటి విడతలో భాగంగా తిప్పర్తి మండలంలో అన్ని గ్రామాల్లో కలిపి 785 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతోపాటు వారందరికీ ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. తిప్పర్తి మండలంలోని తానేదార్‌పల్లి గ్రామాన్ని మొదటగా పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.5 లక్షలను నాలుగు విడతలుగా మంజూరు చేయనుంది.

75 ఇళ్లకు మొదటి విడత బిల్లులు మంజూరు

తిప్పర్తి మండల వ్యాప్తంగా 785 ఇళ్లు మొదటి విడతలో మంజూరు అయ్యాయి. అయితే కొందరు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించలేదు. మొత్తం 785 ఇళ్లకుగాను 470 ఇళ్లకు ముగ్గులు పోసుకున్నప్పటికీ పనులు ప్రారంభించలేదు. 116 ఇళ్లు ప్రస్తుతం బేస్‌మెంట్ లెవల్ వరకు అయ్యాయి. రూఫ్ లెవల్ వరకు 6 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. 75 ఇళ్లకు మొదటి విడత బిల్లులు విడుదలయ్యాయి.

ఎల్లమ్మగూడెంలో సామూహిక ఇళ్ల నిర్మాణాలు

తిప్పర్తి మండలంలోని ఎల్లమ్మగూడెం గ్రామ పంచాయతీలో మొత్తం 22 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా మొత్తం ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. గ్రామంలో అందరూ ఒకేసారి ఒకే మెటీరియల్‌తో ప్రారంభించాలనే ఉద్దేశంతో గ్రామానికి చెందిన ఉట్కూరి సందీప్‌రెడ్డి అవగాహన కల్పించి వారందరికీ ఒకే మేస్త్రిని మాట్లాడి పనులు మొదలు పెట్టించారు.

ఇల్లు రావడం ఆనందంగా ఉంది



ప్రభుత్వం మాలాంటి ఇల్లు లేని పేదవారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం ఆనందంగా ఉంది. చాలా ఏళ్ల నుంచి ఇల్లు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ప్రస్తుతం బేస్‌మెంట్ లెవల్ వరకు ఇంటి నిర్మాణం పూర్తయ్యింది.

– ఉట్కూరి లక్ష్మమ్మ ఎల్లమ్మగూడెం

బేస్‌మెంట్ లెవల్ వరకు పూర్తయ్యింది



ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించుకున్నాం. బేస్‌మెంట్ లెవల్ వరకు ఇల్లు పూర్తయ్యింది. ఇల్లు కట్టుకోవడం మా కలగానే మిగులుతుందని అనుకున్నాం. కానీ సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేసింది.

– పి.పద్మ ఎల్లమ్మగూడెం

అవగాహన కల్పిస్తున్నాం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో లబ్ధిదారులు త్వరగా ప్రారంభించుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. ప్రతిరోజు ఒక గ్రామానికి వెళ్లి సూచనలు ఇస్తున్నాం. మండలంలో 785 ఇళ్లకుగాను 470 మంది లబ్ధిదారులు ముగ్గులు పోసుకుని ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. 116 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ వరకు పూర్తయ్యాయి. మంజూరైన ఇళ్లు మొత్తం ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– జ్యోతి, హౌసింగ్ ఏఈ, తిప్పర్తి

కాంగ్రెస్‌ను సంస్థాగతంగా పటిష్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

- ఏఐసీసీ కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జ్ సంపత్ కుమార్

నల్లగొండ : సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయాలని ఏఐసీసీ సెక్రెటరీ, కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ సంపత్‌కుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. గత బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం అయ్యిందన్నారు. కాంగ్రెస్ పార్టీ.. ప్రభుత్వం జోడెడ్ల లాగా పనిచేస్తుందన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్రంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందేలా చూడాలన్నారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి పెద్దపీట వస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవాలని, ఆ దిశగా పార్టీ శ్రేణులు పనిచేయాలని సూచించారు. పార్టీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు స్థానిక ఎన్నికల్లో తగిన ప్రాధాన్యం ఇస్తామన్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఇద్దరికి రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్, బోర్డు డైరెక్టర్లుగా సామాజిక సమతుల్యత పాటించి అవకాశం కల్పిస్తామని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అబ్బగోని రమేష్‌గౌడ్, జూకూరి రమేష్, వంగూరి లక్ష్మయ్య, పాశం రాంరెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, మనిమద్ది సుమన్, గడ్డం అనూప్‌రెడ్డి, కూసుకుంట్ల రాజిరెడ్డి, ఆలకుంట్ల నాగరత్నంరాజు పాల్గొన్నారు.

మల్లికార్జున ఖర్గే పుట్టినరోజు వేడుకలు

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పుట్టినరోజు వేడుకలను సోమవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ సెక్రెటరీ జిల్లా ఇన్‌చార్జ్ సంపత్ కుమార్, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, వంగూరి లక్ష్మయ్య, పాశం రాంరెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, మనిమద్ది సుమన్, గడ్డం అనూప్ రెడ్డి, కూసుకుంట్ల రాజిరెడ్డి, ఆలకుంట్ల నాగరత్నం రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఇవ్వాలని వినతి

నల్లగొండ పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశానికి ఏఐసీసీ కార్యదర్శి, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సంపత్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి తనకు ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు అల్లి సుభాష్.. సంపత్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళి



నల్లగొండ టౌన్: అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండ టౌన్: కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ పోరాటాలు చిరస్మరణీయమని సీపీఎం నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో నిర్వహించిన అచ్యుతానందన్ సంతాప సభలో వారు మాట్లాడారు. అనంతరం అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నారి ఐలయ్య, పాలడుగు నాగార్జున, బండా శ్రీశైలం, ప్రభావతి, సయ్యద్ హాశం, చినపాక లక్ష్మీనారాయణ, గంజి మురళీధర్, మహమ్మద్ సలీం, పి.నర్సిరెడ్డి, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, నలపరాజు సైదులు, మన్నెం భిక్షం, ఆవుట రవీందర్, కొండ వెంకన్న, కుంభం కృష్ణారెడ్డి, కోట్ల అశోక్‌రెడ్డి, అద్దంకి నరసింహ, అశోక్, గుండాల నరేష్, బొల్లు రవీందర్ సర్దార్ అలీ, కార్తీక్ పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ మృతి పట్ల ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సోమవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. అచ్యుతానందన్ కమ్యూనిస్టు ఉద్యమానికి తన జీవితం అంకితం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు.

చిట్యాల: సీపీఎం వ్యవస్థాపక సభ్యుడు అచ్యుతానందన్ మృతి పట్ల సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య సోమవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. అచ్యుతానందన్ మృతి సీపీఎంకు తీరని లోటన్నారు.

నిరుపేదకు నిత్యావసర సరుకుల పంపిణీ

కేతేపల్లి: మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన కత్రోజు గణేశ్‌చారి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. నిరుపేద అయిన గణేశ్‌చారి కుటుంబానికి చేయూనందించాలనే ఉద్దేశంతో స్థానిక చైతన్య యువజన సంఘం ప్రతినిధులు రూ.15 వేల విలువైన నిత్యావసర సరుకులను సేకరించి సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో చెందిన యువజన సంఘం ప్రతినిధులు భూపతి వీరబాబు, రాచకొంగ అంజయ్య, గడ్డమీది నాగయ్య, పొగాకు శ్రీను, అంతటి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



సరుకులు పంపిణీ చేస్తున్న యువజన సంఘం ప్రతినిధులు

అల్లుకున్న నిర్లక్ష్యం

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో రోడ్డు వెంట ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి తీగజాతి మొక్కలు అల్లుకున్నాయి. అదే విధంగా కేతేపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లే దారిలో విద్యుత్ స్తంభం పైకి తీగజాతి మొక్కలు ఎగబాకి కరెంటు తీగలకు అల్లుకున్నాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కేతేపల్లిలో కరెంటు స్తంభం పైకి పాకిన తీగజాతి మొక్కలు

అంగన్‌వాడీ కేంద్రంలో కోతుల బీభత్సం

కేతేపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో కోతులు బీభత్సం సృష్టించాయి. అంగన్‌వాడీ కేంద్రంలోని స్టోర్ రూంలో నిల్వ ఉంచిన వేలాది రూపాయల విలువైన పౌష్టికాహార సరుకులను ధ్వంసం చేశాయి. ఆదివారం రాత్రి దాదాపు 50 కోతులు అంగన్‌వాడీ కేంద్రం కిటికీ గూండా లోపలికి వెళ్లాయి. చిన్నారులు, గర్భిణులకు పంపిణీ చేసేందుకు కేంద్రంలో నిల్వ ఉంచిన వంట సరుకులను పూర్తిగా ధ్వంసం చేశాయి. సోమవారం ఉదయం విషయాన్ని గుర్తించిన సమీప నివాస గృహాల ప్రజలు కేంద్ర నిర్వాహకులకు సమాచారం అందించారు. కోతుల దాడిలో దాదాపు 1000 కోడిగుడ్లు, బాలామృతం, కంది పప్పు, వంట నూనె, బియ్యం, పాల డబ్బాలు ధ్వంసమైనట్లు తెలిసింది.



కోతులు ధ్వంసం చేసిన వంట సరుకులు

● గోరింటాకు వేడుకలు



నల్లగొండలోని పద్మావతి పార్కులో గోరింటాకు వేడుకలో మహిళలు



చిట్యాల: గోరింటాకు వేడుకలో పాల్గొన్న యువతులు, చిన్నారులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని పద్మావతి పార్కులో మాజీ కౌన్సిలర్ కేసాని వేణుగోపాల్ రెడ్డి, కవిత ఆధ్వర్యంలో మహిళలు గోరింటాకు వేడుక నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మీ, పద్మావతి, పావని, విజయలక్ష్మి, శోభ, ఇందిరా, జ్యోతి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు అదేవిధంగా నల్లగొండ పట్టణంలోని అలకాపురి కాలనీలో మహిళలు గోరింటాకు వేడుకలు నిర్వహించుకున్నారు.

,చిట్యాల పట్టణంలో..

చిట్యాల: ఆషాడమాసం సందర్భంగా చిట్యాల పట్టణంలోని శ్రీ కనకదుర్గ ఆలయంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళలు, యువతులు గోరింటాకు వేడుకలను సోమవారం నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొబ్బలి శివశంకర్‌రెడ్డి, జగిని భిక్షంరెడ్డి, సోమిరెడ్డి శంకర్‌రెడ్డి, చిట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బొబ్బల మేధారెడ్డి, శ్వేత, దివ్య, అనిత, భానుజ, రిజ్వీత, శరణ్య పాల్గొన్నారు.



నల్లగొండలోని అలకాపురి కాలనీలో గోరింటాకు వేడుకలో పాల్గొన్న మహిళలు

రాజకీయ చైతన్యంతోనే సమస్యలు పరిష్కారం

మర్రిగూడ : రాజకీయ చైతన్యంతోనే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున అన్నారు. సోమవారం మర్రిగూడ మండల కేంద్రంలో ఆయన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని శివన్నగూడెం, కిష్టరాయినిపల్లి ప్రాజెక్టుల నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పూర్తిగా అమలు కాలేదని, భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ప్యాకేజీ అందించి ఆదుకోవాలన్నారు. ఈ నెల 25న మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించే నియోజకవర్గ స్థాయి రాజకీ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, మండల కమిటీ సభ్యులు కొట్టం యాదయ్య, సల్వోజు రామలింగాచారి, దామెర లక్ష్మీ, ఏరుకొండ రాఘవేందర్ పాల్గొన్నారు.

25న శిక్షణ తరగతులు

నాంపల్లి: మునుగోడు నియోజకవర్గస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఈ నెల 25న మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి తెలిపారు. సోమవారం నాంపల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ తరగతులకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి తీగల సాగర్, సోషల్ మీడియా రాష్ట్ర ఇన్‌చార్జి పిట్టల రవి హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నకిరేకల్ : పట్టణంలోని వీటీ కాలనీలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి 42వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. హోమం, బలిహరణం, ధ్వజారోహణం, గరుడముద్ద వంటి కార్యక్రమాలను వేద పండితులు కోమాంతురి శ్రీనివాసాచారి, కారంపూడి లక్ష్మీనారాయణాచార్యులు, మూడుంబ రఘుకుమార్ చార్యులు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేడుల్లో ఆలయ కమిటీ చైర్మన్ గుండా వెంకటయ్య, ధర్మకర్తలు బొబ్బలి శేఖర్‌రెడి, కవితా, కైరంకోడ వెంకటేశ్వర్లు, కాసర్ల లక్ష్మీ, పోరెళ్ల ముత్తయ్య, మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మాజీ ఎంపీటీసీ

మర్రిగూడ: మండల పరిధిలోని మేటిచందాపురం గ్రామానికి చెందిన మండారి యాదయ్య నాలుగు సంవత్సరాలుగా అనారోగ్యానికి గురై వైద్య చికిత్సకు ఆర్థిక స్తోమత లేక మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న నామాపురం మాజీ ఎంపీటీసీ ఊరుపక్క సరితనగేష్ బాధిత కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందించడంతోపాటు యాదయ్యకు సొంత ఖర్చులతో ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించారు. యాదయ్య సంపూర్ణ ఆరోత్యంతో ఇంటికి చేరుకున్నారు. దీంతో మాజీ ఎంపీటీసీ సరితనగేష్‌ను మేటిచందాపురం గ్రామస్తులు అభినందించారు.

ఆర్థికసాయం అందజేత

శాలిగౌరారం: మండలంలోని ఆకారం గ్రామానికి చెందిన ఓర్సు సైదులు ఇటీవల పాము కాటుకు గురై మృతిచెందాడు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యా సంవత్సరంలో సైదులుపాటు ఎస్సెస్సీ చదివిన అతడి స్నేహితులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా సైదులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.



నగదు అందజేస్తున్న స్నేహితులు

ఆరోగ్య ఉప కేంద్రాలు నిర్మించేదెప్పుడు!

- ఏడాదిన్నర క్రితం నిధులు మంజూరు
- నేటికీ ప్రారంభం కాని పనులు
- నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు

మునుగోడు: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించడం లేదు అన్నట్లుగా ఉంది మునుగోడు, చండూరు మండలాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాల పరిస్థితి. గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు మూడు, నాలుగు గ్రామాలకు ఒకటి చొప్పున 20 ఏళ్ల క్రితం ప్రభుత్వం ఆరోగ్య ఉప కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ ఆ ఉప కేంద్రాలకు నేటికీ పక్కా భవనాలు నిర్మించలేదు. రెండు మండలాల్లో మొత్తం 17 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. వీటిలో చాలావరకు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

ఎనిమిది భవనాలకు రూ.1.60 కోట్లు మంజూరు..

మునుగోడు సబ్ డివిజన్ పరిధిలోని మునుగోడు, చండూరు, గట్టుప్పల్ మండలాల్లో మొత్తం 17 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. అందులో మునుగోడులో మూడు, చండూరు ఒక కేంద్రానికి మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయి. మిగిలిన 13 కేంద్రాలకు పక్కా భవనాలు లేవు. ఒకటి, రెండు అద్దె భవనాల్లో మిగిలినవి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కొనసాగిస్తున్నారు. భవనాలు లేని వాటిలో మొదటి దఫాగా ప్రభుత్వం ఏడాదిన్నర క్రితం ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున 8 కేంద్రాలకు రూ.1.60 కోట్లను 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో పనులు చేపట్టేందుకు కూడా ఏడాది క్రితం టెండర్లు పిలిచారు. టెండర్లు దక్కించుకున్న కొందరు అగ్రిమెంట్ చేసుకున్నారు. మరికొందరు నేటికీ అగ్రిమెంట్ చేసుకోలేదు.



ఊకొండిలో పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న ఉప కేంద్రం

కొన్నింటికి స్థలాలే లేవు..

మొత్తం 8 ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా.. అందులో మునుగోడులో 2, చండూరులో 4, గట్టుప్పల్ మండలంలో 2 చొప్పున మంజూరయ్యాయి. అందులో దాదాపు సగం భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలం లేని కారణంగా పనులు ప్రారంభించలేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఆయా గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించి పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

మా సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 8 ఆరోగ్య ఉప కేంద్రాల భవనాల నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఒక్కో కేంద్రానికి రూ.20 లక్షల చొప్పున రూ.1.60 కోట్లు మంజూరయ్యాయి. భవనాల నిర్మాణానికి టెండర్లు పిలిచాం. పనులు దక్కించుకున్న కొందరు కాంట్రాక్టర్లు అగ్రిమెంట్ చేసుకున్నారు. వారితో అతి త్వరలో పనులు మొదలు పెట్టించి వేగంగా నిర్మాణం పూర్తి చేయిస్తాం. కొన్ని కేంద్రాల నిర్మాణానికి స్థలాలు లేవు. స్థలాలను ఎంపిక చేయాలని రెవెన్యూ అధికారులని కోరాం.

– నాగేశ్వర్‌రావు, పంచాయతీరాజ్ డీఈ